ఘనంగా శ్రీసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం



ఊరేగింపుగా వెండి కిరీటం తీసుకు వస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: పెద ఉప్పలం గ్రామంలో శ్రీ సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోశెట్టి వెంకటరమణ రూ. 30 వేల ఆర్థిక సహాయంతో 300 గ్రాముల వెండి కిరీటం స్వామికి అందజేశారు. గ్రామంలో శెట్టిబలిజ వీధిలో నాలుగు రోడ్ల జంక్షన్‌లో నిలిపిన శ్రీసిద్ధి గణపతి వార్షికోత్సవ వేడుకల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

31లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

యలమంచిలి : ఈనెల 31లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ కల్పించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అని పన్నులు యలమంచిలి మున్సిపల్ కార్యాలయం వద్ద నేరుగా కాని cdma. ap. gov. in వెబ్‌సైట్‌లో కానీ చెల్లించాలని తెలిపారు.

సంపద కేంద్రాల పరిశీలన

పాయకరావుపేట : మండలంలో గల పెంటకోట, గోపాలపట్నం గ్రామాల్లో గల చెత్త నుండి సంపద కేంద్రాలను పరిశీలించినట్లు ఈవోఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు తయారు చేయాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామ సచివాలయ కార్యదర్శులకు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

రాంబిల్లి : భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేముడునాయుడు కోరారు. శుక్రవారం ఆయన భవన నిర్మాణ కార్మికుల నాయకుడు రాంబాబు తదితరులతో కలిసి తహసీల్దార్ అప్పలస్వామికి వినతిపత్రం అందజేసారు. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అందుబాటులో ఆరోగ్య పరీక్షలు

- రాంబిల్లి, దిమిలి పీహెచ్‌సీలకు అధునాతన యంత్రాల సరఫరా
- చక్కటి సేవలందిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

గతంలో ప్రభుత్వ ఆస్పత్రులు ఎలాంటి సదుపాయాలు లేక రోగులు ఆశించిన స్థాయిలో సేవలందించలేకపోయేవి. చిన్నచిన్న పరీక్షలకు కూడా ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వచ్చేది. దీంతో బాధితులు ఆర్థికంగాను, శారీరకంగాను ఇబ్బందులకు లోనయ్యేవారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రజలకు అందుబాటులో నిర్మించిన పీహెచ్‌సీలలోనే కోట్లు ఖరీదు చేసే పరీక్ష యంత్రాలను ఏర్పాటు చేయడంతో వేలు ఖరీదు చేసే అన్ని పరీక్షలు పేదలకు అందుబాటులోకి వచ్చాయి. పీహెచ్‌సీల్లోనే పరీక్షలు, వైద్యసేవలు, మందులు ఉచితంగా అందజేస్తుండడంతో అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రాంబిల్లిలో సకల సౌకర్యాలతో నిర్మించిన పీహెచ్‌సీ



దిమిలి పీహెచ్‌సీలో పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



రాంబిల్లిలో పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

రాంబిల్లి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు, తీరుతెన్నులు పూర్తిగా మారిపోయాయి. చక్కటి సేవలు, నాణ్యమైన మందులతో కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుండడంతో ఒకప్పుడు వీటి వైపు కూడా చూడని వారు కూడా ఇప్పుడు గవర్నమెంట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో రాంబిల్లిలో రూ. 2.6 కోట్లతో నూతన ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. దిమిలిలో సుమారు రూ. కోటితో ఆస్పత్రిని ఆధునీకరించారు. ఇదిలా వుండగా రాంబిల్లి, దిమిలి పీహెచ్‌సీల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి ఆధునాతన పరీక్ష యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో ఈసీజీ, డెంగీ, మలేరియా జ్వరాలతో పాటు ప్లేట్‌లెట్స్ కౌంట్, క్రియాటిన్ వంటి పరీక్షలకు అనకాపల్లి, యలమంచిలి ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో రోగులపై ఆర్థిక భారం పడి, వారు శ్రమ పడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఎక్స్‌రే తప్ప అన్ని రకాల రక్త, మూత్ర, డెంగీ, మలేరియా ఇతర పరీక్షలను అతి తక్కువ సమయంలో పీహెచ్‌సీల్లో చేసి ఉచితంగా అందజేస్తున్నారు. వీటితో పాటు బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నారు. సుమారు రూ. 1500 నుంచి రూ. 2 వేల వరకు ప్రైవేటు ల్యాబ్‌లలో చార్జ్ చేసే పరీక్షలను పీహెచ్‌సీల్లో ఉచితంగా చేస్తున్నారు. దీంతో ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక గత టీడీపీ హయాంలో కుక్కకాటు, పాము కాట్లకు సైతం మందులు అందుబాటులో వుండేవి కాదు. రాంబిల్లి, దిమిలి పీహెచ్‌సీలకు ఒక్కరే ల్యాబ్ టెక్నీషియన్ ఉండేవారు. కానీ ఇప్పుడు రెండు చోట్ల ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో ఉన్నారు. ఈ రెండు పీహెచ్‌సీల ద్వారా సుమారు లక్ష మంది ప్రజలకు వైద్య సేవలందుతున్నాయి. ఈ పీహెచ్‌సీల్లో ఇద్దరేసి వైద్యులున్నారు. మందులు పుష్కలంగా ఉన్నాయి.



రాంబిల్లి పీహెచ్‌సీ ల్యాబ్‌లో ఆధునిక యంత్రాలు

రోగులకు ఎంతో మేలు..



గతంలో పీహెచ్‌సీల్లో అరకొర మందులు, వైద్యులు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించేవారు. రాంబిల్లి, దిమిలిలో ఒక్కరే ల్యాబ్ టెక్నీషియన్ ఉండడం వల్ల పరీక్షలు ఆలస్యం అయ్యేవి. ఇప్పుడు రెండు చోట్ల ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, అందుబాటులో వైద్యులున్నారు. ల్యాబ్‌లో అన్ని పరీక్షలు సకాలంలో చేస్తుండటం అభినందనీయం.

–డబ్బీరు కామేశ్వరరావు, దిమిలి

త్వరితగతిన పరీక్షలు..



ప్రభుత్వం పీహెచ్‌సీలకు అధునాతన పరీక్ష యంత్రాలను సరఫరా చేసింది. తక్కువ సమయంలో ఎక్కువ మందికి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈసీజీ, డెంగీ, మలేరియా ఇతర పరీక్షలు గతంలో అందుబాటులో వుండేవి కాదు. చాలా వరకు ఇప్పుడు పీహెచ్‌సీ ల్యాబ్‌లలోనే పరీక్షలు చేసి ఫలితాలు ఇచ్చే అవకాశం అందుబాటులోకి వచ్చింది.

–వి. అప్పలరాజు , ల్యాబ్ టెక్నీషియన్

ప్రజలపై ఆర్థిక భారం ఉండదు..



పీహెచ్‌సీల్లో పలు రకాల ఆరోగ్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ప్రైవేట్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకోవడమంటే ప్రజలపై ఆర్థిక భారం పడినట్లే. ఇక ఇప్పుడు ఈ సమస్య లేకుండా పోయింది. పరీక్షలు, వైద్య సేవలు, మందులు అన్నీ పుష్కలంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలు పీహెచ్‌సీల సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఆర్. వెంకటేష్, దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి

రైతు సంక్షేమమే ధ్యేయం

మునగపాక : రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సున్నా వడ్డీ పంట రుణాలకు సంబంధించిన అర్హుల జాబితాను శుక్రవారం రైతులకు అందుబాటులో ఉండేలా ప్రదర్శించారు. 350 మంది రైతులకు సున్నావడ్డీ పంట రుణాలు అందుతున్నాయన్నారు. వీఏఏ సింధూజ, రైతులు వెలగా వెంకటప్పారావు, శ్రీనివాసరావు, టెక్కలి సూరప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



రాంబిల్లిలో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

అచ్యుతాపురం : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పింఛన్ల పంపిణీ ముమ్మరంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు చురుగ్గా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. మండలంలో 11263 మంది లబ్ధిదారులుండగా తొలి రోజే 6700 మందికి పింఛన్లు అందజేశారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియలో సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. మండలంలోని 30 పంచాయతీల్లో శుక్రవారం పింఛన్ల పంపిణీ ప్రక్రియ ఉత్సాహంగా సాగింది. వేకువజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. గృహసారథులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

చూచుకొండలో..

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నామని వైస్ ఎంపీపీ బోజా లక్ష్మీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని చూచుకొండలో పింఛన్లు అందజేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం కల్పించాలన్నారు. ఎంపీటీసీలు కాండ్రేగుల కిరణ్‌కుమార్, బోడకుర్తి గణేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులకు రాయితీ ఎరువుల పంపిణీ

మునగపాక : రైతులకు రాయితీపై ఎరువులు అందజేస్తున్నామని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం సీజన్‌కు సంబంధించిన ఎరువులను రాయితీపై అందజేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచారన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు బొడ్డేడ బుజ్జి, వీఏఏ ఉత్య రవిరాజ్, రైతులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి.. రెండు చుక్కలు



పల్స్‌పోలియో కార్యక్రమం గురించి అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



పోలియోపై ప్రచారానికి వెళ్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

మునగపాక : ఆదివారం జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. మునగపాక పీహెచ్‌సీ పరిధిలో 3 రూట్లు అలాగే 34 బూత్‌లలో 3062 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు నిర్ణయించామన్నారు. అలాగే 16 ఇటుక బట్టీల్లో పనిచేసే పిల్లలకు, హైరిస్క్ పిల్లలకు వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం మండల వ్యాప్తంగా ఆటో ద్వారా ప్రచారం నిర్వహిస్తామన్నారు.

పోలియోపై ప్రచారం..

ఎస్.రాయవరం : ఆదివారం పల్స్‌పోలియో చుక్కలు విధిగా వేయించాలని సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు రాజేశ్వరి, శక్తిప్రియ తెలిపారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో గల గ్రామాల్లో 24 బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఎస్.రామవరం బస్టాప్ వద్ద ప్రయాణంలో ఉన్న పిల్లలకు మొబైల్ టీమ్ ద్వారా పోలియో చుక్కలు వేస్తామన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 1237 మంది చిన్నారులు ఉన్నారని చెప్పారు.అలాగే పెనుగొల్లు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాలకు 30 బూత్‌ల ద్వారా రెంటు ట్రాన్సిట్ పాయింట్లు, అడ్డురోడ్డు బస్టాప్, నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద పోలియో చుక్కలు వేస్తామన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 3080 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందని వైద్యాధికారి రాజేశ్వరి తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

పాయకరావుపేట : ఈ నెల 3వ తేదీ ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాయకరావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 3082 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయవలసి ఉందన్నారు. 27 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. శ్రీరాంపురం పీహెచ్‌సీ పరిధిలో 2367 మందికి పిల్లలకు పోలియో చుక్కలు వేయవలసి ఉందన్నారు. 26 చోట్ల బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. మంగవరం పీహెచ్‌సీ పరిధిలో 1675 మంది పిల్లలకి పోలియో చుక్కలు వేస్తామని, 20 చోట్ల బూత్‌లు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి సంకీర్తన తెలిపారు.

కోటవురట్లలో..

కోటవురట్ల: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. కె.వెంకటాపురం పీహెచ్‌సీ పరిధిలో 2,186 మంది చిన్నారులు లక్ష్యంగా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌వోలకు స్థానచలనం

మునగపాక : మండలంలో పలు సచివాలయాల్లో సేవలందిస్తున్న వీఆర్వోలను మండల పరిధిలోని ఇతర సచివాలయాలకు ఇన్‌చార్జిలుగా నియమించినట్లు తహసీల్దార్ బి.పాపారావు తెలిపారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు, పేదలందరికీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు వేగవంతమయ్యేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉమ్మలాడ వీఆర్వోగా పని చేస్తున్న పి.సురేష్‌ను మునగపాక-2కు అలాగే వాడ్రాపల్లి వీఆర్వో సీహెచ్ జయకృష్ణను మునగపాక-1కు, మునగపాక వీఆర్వోగా పని చేస్తున్న పి.హిమబిందును నాగులాపల్లి-1కు, నాగులాపల్లి-1 వీఆర్వో తరుణ్‌ను గంటవానిపాలెం సచివాలయానికి ఇన్‌చార్జిలుగా నియమించినట్లు పాపారావు తెలిపారు.



ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



యలమంచిలి ప్రభుత్వ కళాశాల వద్ద విద్యార్థుల హాల్ టికెట్లు తనిఖీ చేస్తున్న మహిళా కానిస్టేబుల్



నక్కపల్లి గురుకుల కళాశాల వద్ద విద్యార్థుల సందడి



ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు



పరీక్షా కేంద్రం వద్ద 8 గంటలకే హాజరైన విద్యార్థులు

యలమంచిలి రూరల్ : పట్టణంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కేంద్రాల్లోని విద్యార్థులను గంట ముందు నుంచే అనుమతిస్తామని, నిర్ణీత సమయానికి ఒక నిమిషం ఆలస్యమైనా రానివ్వబోమని అధికారులు వెల్లడించడంతో విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొక్కిరాపల్లి అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం మొదటి పరీక్ష కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు సీసీ నిఘా ఉంచారు. తొలిరోజు ద్వితీయ భాష తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలు జరిగాయి. పట్టణ ఎస్సై కె. సావి నాయుడు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు తనిఖీ చేశారు. కొక్కిరాపల్లి గురుకులం కేంద్రం వద్ద రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేడ్కర్ గురుకుల కళాశాల, కేజీబీవీల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 509 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తెలిపారు. అదే విధంగా కార్తికేయ జూనియర్ కళాశాలలో 450 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు కళాశాల అధ్యాపకులు తెలిపారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీపీ గోవింద్ తదితరులు

యలమంచిలి : ఏటికొప్పాకలో అగ్ని ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధితులను యలమంచిలి ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. అగ్ని ప్రమాదంలో జాగు నాగేశ్వరరావు, జాగు రమణల పూరిల్లు దగ్ధమైంది. వారికి శుక్రవారం ఎమ్మెల్యే రమణమూర్తిరాజు రూ.10 వేలు తక్షణ సాయంగా యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, సేనాపతి సంధ్యారాణి, రాము, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర చేతుల మీదుగా అందజేశారు. బాధితులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా కృషి చేయాలని యలమంచిలి తహశీల్దారు అప్పలరాజును ఎమ్మెల్యే ఆదేశించినట్లు ఎంపీపీ గోవింద్ తెలిపారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, ఏటికొప్పాక గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం వెంకటరావు, హైస్కూల్ చైర్మన్ దేవరపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శి

యలమంచిలి రూరల్ : ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శి అని ఎంపీపీ బోదెపు గోవింద్, యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి అప్పారావు అన్నారు. మండలంలోని రేగుపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వత్సవాయి జానకిరామరాజు స్వచ్ఛంద పదవీ విరమణ సందర్భంగా లైనుకొత్తూరు ఎస్వీ కన్వెన్షన్ హాల్లో జరిగిన సన్మాన సభలో పలువురు వక్తలు జానకిరామరాజు సేవలను కొనియాడారు. యలమంచిలి ఎంఈవోలు యల్లపు మీనాక్షి, పి. అరుణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్రెపు సత్య గుప్తా, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఏవీహెచ్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు

'మహాసేన రాజేష్‌కు సీటివ్వడం సరి కాదు'

మునగపాక : బ్రాహ్మణులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన మహాసేన రాజేష్‌కు ఎమ్మెల్యే సీటు కేటాయించడం సరికాదని ఉత్తరాంధ్ర పురోహితుల సంఘం ప్రతినిధి వెలవలపల్లి కోటేశ్వరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. మానవత్వం తెలియని వ్యక్తులను చట్టసభలకు పంపాలనుకోవడం విచారకరమన్నారు. హిందూ ధర్మానికి తిలోదకాలిచ్చే రాజేష్ లాంటి వ్యక్తులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. హిందువులు ఎవరూ రాజేష్‌కు ఓటు వేసే అవకాశం లేదన్నారు. బ్రాహ్మణులకు రాజేష్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.